క్లుప్తంగా

నేడు ఉద్యాన సమ్మేళనం

సింహాద్రిపురం : ఉద్యాన పంటలపై రైతులలో అవగాహన కల్పించేందుకు ఉద్యాన శాఖ ఆధ్వర్యంలో మంగళవారం కడప నగరంలోని రాయచోటి రోడ్డు పరిధిలో ఉన్న మాధవి కన్వెన్షన్ సెంటర్ హాలులో ఉద్యాన సమ్మేళనం నిర్వహించనున్నట్లు ముద్దనూరు ఉద్యాన శాఖాధికారి మల్లికార్జునరెడ్డి తెలిపారు. సోమవారం ఆయన తెలుపుతూ ఈ సమ్మేళనంలో పంట సాగుపై ప్రసంగాలు, ఉద్యాన రంగంలో ఉన్న వివిధ నిష్ణాతులచే ప్రసంగాలు, ఆధునిక సాంకేతికతపై ప్రసంగాలు, రైతులు, వ్యాపారస్తులు, ఎగుమతిదారులచే మార్కెటింగ్ అనుసంధానం వంటి కార్యక్రమాలు ఉంటాయన్నారు. ఈ సమ్మేళనాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

నిర్వాసిత ప్రాంతాలు ఎంపిక

మైలవరం: మండల పరిధిలోని దుగ్గనపల్లి ప్రాంత వాసులకు ఇండ్ల స్థలాలు ఇచ్చేందుకు మూడు ప్రాంతాలు ఎంపిక చేసినట్లు తహసీల్దార్ లక్ష్మీనారాయణ తెలిపారు. సోమవారం తహసీల్దార్ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ దాల్మియా పరిశ్రమ వల్ల వచ్చే దుమ్ము ధూళి వల్ల గ్రామస్తులు ఇబ్బందులు పడుతున్నామని జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారని, కలెక్టర్ ఆదేశాల మేరకు క్షేత్ర స్థాయిలో పరిశీలించి చిన్న కొమెర్ల –కొత్త పల్లె మధ్య ప్రాంతంలో, పెద్దకొమెర్ల గ్రామానికి తూర్పు ప్రాంతంలో పడమటి వైపు ప్రాంతంలో స్థలాలను పరిశీలించామన్నారు. గ్రామస్తులతో చర్చించి వారు ఎంపిక చేసుకున్న ప్రాంతంలో వారికి స్థలాలు ఇస్తామని తెలిపారు. ఆమేరకు ఆర్డీఓ స్థల పరిశీలకు వచ్చిన తర్వాత వెంటనే దుగ్గనపల్లి గ్రామస్తులకు గ్రామసభల ద్వారా వారి నిర్ణయాన్ని బట్టి ఎంపిక చేస్తామని పేర్కొన్నారు.

పార్టీకి పూర్వ వైభవం తెస్తాం



నిస్సార్ బాషాను సన్మానిస్తున్న నాయకులు

వేంపల్లె : వైఎస్సార్‌సీపీకి పూర్వ వైభవం తెస్తామని ఆ పార్టీ ప్రచార విభాగం రాష్ట్ర సంయుక్త కార్యదర్శి షేక్ నిస్సార్ బాషా తెలిపారు. వైఎస్సార్‌సీపీ ప్రచార విభాగం రాష్ట్ర సంయుక్త కార్యదర్శిగా షేక్ నిస్సార్ బాషాను అధిష్టానం నియమించింది. ఈ నేపథ్యంలో ఆదివారం వేంపల్లెలో వైఎస్సార్‌సీపీ నూర్ భాషా సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఓ.రసూల్, జిల్లా ఆర్గనైజింగ్ సెక్రటరీ ఎస్.నూరుల్లా, రాష్ట్ర రెడ్డి కమ్యూనిటీ సంఘం అధ్యక్షుడు సురేంద్ర రెడ్డి, వైఎస్సార్ చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ వీరారెడ్డి, బీసీ నాయకులు ఈశ్వరయ్య నిస్సార్ బాషాను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో వార్డు మెంబర్ ముత్యాల ఆంజనేయులు, షేక్ అలీమ్ బాషా, రబ్బానీ బాషా, నసీం బాషా, అయూబ్, మాబు సాబ్ పాల్గొన్నారు.

రీ సర్వే పకడ్బందీగా నిర్వహించాలి



మాట్లాడుతున్న ఆర్డీఓ సాయిశ్రీ

జమ్మలమడుగు రూరల్: రెండో విడత చేపట్టిన రీ సర్వేను పకడ్బందీగా నిర్వహించాలని జమ్మలమడుగు ఆర్డీఓ ఆదిమూలం సాయిశ్రీ పేర్కొన్నారు. సోమవారం ఆర్డీఓ సభా భవనంలో డివిజన్ పరిధిలోని అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. సమస్యలు లేకుండా చూడాలని ఆమె సర్వేయర్లకు సూచించారు. అనంతరం డివిజన్ ఇన్‌స్పెక్టర్ సర్వేయర్ పుల్లయ్య మాట్లాడుతూ డివిజన్‌లో రెండో విడత సర్వేలో గ్రామ సరిహద్దులు గుర్తిస్తామని తెలిపారు. సర్వేలో ఏమైన అనుమానాలు వస్తే వెంటనే సంబంధిత ఉన్నతాధికారులను అడిగి పరిష్కారించుకోవాలని ఆదేశించారు. రీ సర్వే డిప్యూటీ తహసీల్దార్లు, డివిజన్ డిప్యూటీ సర్వేయర్లు హరి, వెంకటేశు, మండల సర్వేయర్లు, వీఆర్వోలు పాల్గొన్నారు.

మేడే స్ఫూర్తితో పోరాటం



కరపత్రాలు ఆవిష్కరిస్తున్న శివనారాయణ

ముద్దనూరు: మేడే స్ఫూరితో కార్మిక హక్కుల కోసం పోరాటం చేస్తామని డీవైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి వీరనాల శివకుమార్ పేర్కొన్నారు. సోమవారం స్థానిక ఐసీడీఎస్ కార్యాలయంలో సీఐటీయూ నాయకులు, అంగన్వాడీ వర్కర్స్‌తో కలిసి మేడే కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా శివకుమార్ మాట్లాడుతూ ప్రపంచ కార్మిక దినోత్సవం మేడేను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. కేంద్ర ప్రభుత్వం కార్మిక వ్యతిరేక విధానాలకు పాల్పడుతోందని మండిపడ్డారు. సీఐటీయూ నాయకురాళ్లు హైమావతి, చంద్రకళ, విజయమ్మ,భవాని పాల్గొన్నారు.

ఘనంగా ఆలయ వార్షికోత్సవం

వల్లూరు: పుష్పగిరి క్షేత్ర ఆలయాల సముదాయంలో భాగమైన చింతలపత్తూరులోని ఇంద్రనాథేశ్వర స్వామి ఆలయ వార్షికోత్సవాలు సోమవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. అర్చకుల ఆధ్వర్యంలో ఉదయం గోపూజను నిర్వహించారు. అనంతరం గణపతిపూజతో కార్యక్రమాలను ప్రారంభించారు. పుణ్యాహవాచనము, మంటపారాధన అనంతరం మహన్యాసపూర్వక ఏకాదశవార రుద్రాభిషేకాన్ని నిర్వహించారు.

కంకర పరిచారు.. బీటీ మరిచారు

- అర్ధాంతరంగా ఆగిన రోడ్డు పనులు
- ప్రయాణం నరక ప్రాయం
- పట్టించుకోని అధికారులు



కంకర తేలిన చవ్వనాగాయపల్లె రోడ్డు

కొండాపురం: గ్రామీణ రోడ్లు నాగరికతకు చిహ్నాలు అని పదేపదే చెబుతుంటారు. అయినా పాలకులు మాత్రం వాటిపై దృష్టి సారించడంలో అలసత్వం వహిస్తున్నారు. గ్రామీణ రోడ్లు బాగు చేస్తామని చెప్పిన అధికార పార్టీ నాయకులు వాటి ఊసే మరిచిపోయారని ప్రజలు విమర్శిస్తున్నారు. గ్రామాల్లో మౌలిక వసతులు కల్పిస్తామని ఎన్నికల ముందు ఆర్భాటాలు చేసిన నాయకులు ఇప్పుడెక్కడున్నారని ప్రశ్నిస్తున్నారు. మండలంలో నాలుగు నెలల క్రితం రోడ్లల్లో గుంతలు పూడ్చేందుకు అరకొరగా పనులు ప్రారంభించి కొన్ని చోట్ల కంకరపరచి తారు వేయకుండా వదిలేశారు. ప్రస్తుతం ఈ దారుల్లో ప్రయాణం నరకప్రాయంగా మారిందని వాహనదారులు, రైతులు, ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మండలంలోని బి. కొత్తపల్లె నుంచి చవ్వనాగాయపల్లె గ్రామం వరకు ఎక్సకవేటర్‌తో రోడ్డు చదను చేసి కంకర పరిచారు. అలాగే ఎస్. తిమ్మాపురం నుంచి యల్లనూరుకు వెళ్లే దారిలో కూడా గుంతలను పూడ్చి కంకర పరిచారు. వెంకటాపురం నుంచి బురుజుపల్లె వరకు అక్కడక్కడ ఎక్సకవేటర్‌తో రోడ్డును చదును చేసి డస్ట్ కంకర మిక్సింగ్ వేశారు. రోడ్ల నిర్మాణానికి కంకరపరచి పనులు చేసి వదిలేశారు. ఇంతవరకు తారు వేయ లేదని ఆయా గ్రామస్తులంటున్నారు.

అవస్థలు పడుతున్న వాహనదారులు, ప్రజలు

రోడ్డు అంతా గుంతలు, కంకరతో ఉండడంతో ప్రయాణం చేయాలంటే ఇబ్బందులు పడుతున్నామని మండిపడుతున్నారు. ద్విచక్రవాహన దారులు అరచేతిలో ప్రాణాలు పెట్టుకుని ప్రయాణించాల్సివస్తోందని, రాత్రి సమయంలో పరిస్థితి మరింత భయంకరంగా ఉంటుందని అంటున్నారు. ఈ దారుల్లో బైక్‌లు పట్టు తప్పి కింద పడి వాహనదారులు గాయాలపాలవుతున్నారు. అధికారులకు, నాయకులకు పలుమార్లు విన్నవించినా పట్టించుకోవడంలేదని వారంటున్నారు. ఆర్అండ్‌బీ ఉన్నతాధికారులు స్పందించి రోడ్లకు కంకర పరిచి తారు వేయాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు. ఈ విషయంపై మండల ఆర్అండ్‌బీ ఏఈ సంజీవకుమార్‌ను వివరణ కోరగా.. తిమ్మాపురం నుంచి ఎల్లనూరు వరకు గుంతలు ఎక్కువగా ఉన్నాయి. ప్రస్తుతం ఉన్న నిధులు సరిపోవు. అందు వల్ల కొత్తరోడ్లు కోసం ప్రతిపాదనలు పంపామని తెలిపారు.

అధ్వానంగా రహదారులు



జమ్మలగమడుగు - మైలవరం ప్రధాన రహదారి

మైలవరం: మండలంలోని గ్రామీణ రహదారులు మరీ ఘోరంగా తయారయ్యాయి. ఆ గ్రామాలకు వెళ్లాలంటేనే నరకప్రాయంగా మారింది. మండల కేంద్రమైన మైలవరానికి వెళ్లాలంటే గుంతల రోడ్డులో ఒళ్లు హూనమవుతోంది. నిత్యం ఈ రహదారుల గుండా ప్రజలు, వాహదారులు తిరుగుతుంటారు. ముఖ్యంగా ఈ మార్గం నుంచే శైవక్షేత్రాలైన గురప్ప కోన, అగస్త్యేశ్వరకోన, పీర్ గైబుసా కొండలతోపాటు పర్యాటక ప్రాంతం మైలవరం జలాశయానికి వెళ్లాలి. ఇక్కడికి వెళ్లాలంటే సరైన రహదారులు లేక వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అదేవిధంగా జమ్మలమడుగు నుంచి వేపరాల మీదుగా వెళ్లే రహదారి అత్యంత ప్రమాదకరంగా మారింది. ఈ మార్గంలో నాపరాతి గనులు ఉన్నాయి. గనుల నుంచి రాళ్లు బయటకు తీయడంతో భారీ గుంతలు ఉన్నాయి. ఏ మాత్రం అజాగ్రత్తగా ఉన్న బైక్, కార్లు, ఆటోలు గుంతల్లో పడే ప్రమాదం ఉంది. ఈ మార్గంలో ఎలాంటి ప్రమాద సూచికలు లేవు. ఇప్పటికైనా అధికారులు చొరవ తీసుకుని రోడ్లను మరమ్మతులు చేసి, ప్రమాదాలు జరుగకుండాసూచిక బోర్డులు ఏర్పాటు చేయాలని వాహనదారులు కోరుకుంటున్నారు.

ఆర్టీసీ కార్మికుల పోరుబాట



రిలే నిరాహార దీక్ష చేస్తున్న ఎన్ఎంయూ నాయకులు

పులివెందుల రూరల్ : ఆర్టీసీ గ్యారేజ్‌లోని ఉద్యోగుల అపరిష్కృత సమస్యలను వెంటనే పరిష్కరించాలని ఎన్ఎంయూ నాయకులు పోరుబాట పట్టారు. సోమవారం పట్టణంలోని స్థానిక ఆర్టీసీ బస్టాండులో రిలే నిరాహార దీక్ష కార్యక్రమాలు చేపట్టారు. ఎన్ఎంయూ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు పులివెందుల డిపో ఎదుట రిలే నిరాహార దీక్షలను ఎన్ఎంయూ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి పీఎస్ఎన్ రావు, డిపో చైర్మన్ జీవీ రమణ, సీసీఎస్ డెలిగేట్ రామలింగారెడ్డి, రీజినల్ కమిటీ మెంబర్ ఈశ్వరయ్య, వర్కింగ్ ప్రెసిడెంట్ ఎం.ఎం.రెడ్డి నిరాహార దీక్ష చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఉద్యోగుల ఉద్యోగ భద్రత సర్క్యులర్ 2019 అన్ని డిపోలో వెంటనే అమలు చేయాలన్నారు. అక్రమ సస్పెండ్ ఆపాలన్నారు. ఈహెచ్ఎస్ స్థానంలో పాత వైద్య విధానాన్ని కొనసాగించాలన్నారు. ఏపీఎస్ఆర్టీసీలో మాదిరిగానే క్యాడర్ స్ట్రెంత్ అమలు చేయాలన్నారు. డబుల్ డ్యూటీలు అమౌంట్‌ను పెంచాలన్నారు. నాన్ ఆపరేషన్ ఉద్యోగుల పెండింగ్ సమస్యలను వెంటనే పరిష్కరించాలన్నారు. తమ న్యాయమైన సమస్యలు పరిష్కారం పరిష్కరించకపోతే రిలే నిరాహార దీక్షలను ఉధృతం చేస్తామని హెచ్చరించారు.

అక్రమ సస్పెన్షన్‌లు ఎత్తివేయాలి

జమ్మలమడుగు: ఆర్టీసీ కార్మికులపై అక్రమ సస్పెన్షన్‌లను ఎత్తివేయడంతోపాటు 2019 సర్క్యూలర్‌ను వెంటనే అమలు చేయాలని ఎన్ఎంయూ నాయకులు ఓబుళరెడ్డి, డిమాండ్ చేశారు. సోమవారం రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు స్థానిక ఆర్టీసీ డిపో వద్ద కార్మికులు నిరాహార దీక్షలను డిపో కార్యదర్శి శివుడు అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా ఓబుళరెడ్డి మాట్లాడుతూ నాలుగు సంవత్సరాలుగా ఆగిపోయిన పదోన్నతులను వెంటనే ఇవ్వాలన్నారు. ప్రభుత్వం జీవో ఇచ్చిన ప్రకారం పిల్లల సంరక్షణ సెలవులను మహిళలకు మంజూరు చేయాలని, పీహెచ్ఎస్ స్థానంలో పాత వైద్య విధానాన్ని అమలు చేయాలని చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆర్టీసీ కార్మికులు తదితరులు పాల్గొన్నారు.

నేడు గ్రామ దర్శిని

వీరపునాయునిపల్లె: మండలంలోని ఎస్ పాలగిరి గ్రామ పంచాయతీ పరిధిలోని నేల తిమ్మాయపల్లె, మర్రిపల్లె, ఓబుల్‌రెడ్డి గ్రామాల్లో మంగళవారం గ్రామ దర్శిని కార్యక్రమం చేపట్టనున్నట్లు మండల అభివృద్ధి అధికారి చంద్రశేఖర్‌రెడ్డి తెలిపారు. ఆయా గ్రామాల్లో చేపడుతున్న ఉపాధి పనులు, పారిశుద్ధ్యం, తాగునీరు, అంగన్‌వాడి కేంద్రాల ద్వారా అందిస్తున్న సేవలను పరిశీలించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో సచివాలయ సిబ్బంది, ఉపాధి హామీ సిబ్బంది పాల్గొనాలని ఆయన కోరారు.

ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి

వేముల : ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని ఎంపీడీఓ లోకేష్ తెలిపారు. వేముల మండల అభివృద్ధి అధికారిగా సోమవారం లోకేష్ బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలాన్ని అన్ని రంగాలలో అభివృద్ధి చేస్తానని, గ్రామాల్లో సమస్యలు లేకుండా చర్యలు తీసుకుంటానని తెలిపారు. ఇక్కడ ఎంపీడీఓగా పనిచేస్తున్న మల్లికార్జునరెడ్డి చక్రాయపేట మండలానికి బదిలీ అయ్యారు. దీంతో లింగాల మండల ఏఓగా పనిచేస్తున్న లోకేష్‌ను వేముల ఎంపీడీఓగా నియమిస్తూ ఉత్తర్వులు వచ్చాయి.

నేరాల కట్టడికే కార్డన్ సెర్చ్

ఎర్రగుంట్ల (జమ్మలమడుగు): నేరాల కట్టడి కోసమే కార్డన్ సెర్చ్ నిర్వహిస్తున్నామని అర్బన్ సీఐ నరేష్‌బాబు తెలిపారు. పట్టణ పరిధిలోని ప్రకాశ్ నగర్‌లో అర్బన్ సీఐ ఆధ్వర్యంలో కార్డన్ సెర్చ్ నిర్వహించారు. ఈ సందర్భంగా సరైన పత్రాలు లేని ద్విచక్రవాహనాలను స్వాధీనం చేసుకున్నారు. సీఐ మాట్లాడుతూ ప్రతీ ఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలను పాటిస్తూ ప్రయాణించే సమయంలో వాహనాల అన్ని సర్టిఫికెట్లను వెంట ఉంచుకోవాలన్నారు. ఎవరైనా అనుమానాస్పద వ్యక్తులు కనిపిస్తే పోలీసులకు సమాచారం ఇవ్వాలన్నారు. చట్టవిరుద్ధ కార్యకలపాలకు పాల్పడితే చట్టరీత్యా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కార్డెన్ సెర్చ్‌లో పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

క్రమశిక్షణతోనే ఉన్నత శిఖరాలు



విద్యార్థులతో చంద్రశేఖరరెడ్డి, ఉపాధ్యాయులు

పులివెందుల టౌన్ : విద్యార్థి దశలో క్రమశిక్షణ కలిగి ఉంటేనే తదుపరి జీవితంలో ఉన్నత శిఖరాలు అధిరోహించడం సాధ్యమని ఎస్వీఎస్ఆర్ ఫంక్షన్ హాల్ అధినేత సారెడ్డి చంద్రశేఖర్ రెడ్డి పేర్కొన్నారు. సోమవారం పట్టణంలోని స్థానిక రమణప్ప సత్రం బడి పాఠశాలలో ఉచిత విద్య కోచింగ్ ముగింపు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సారెడ్డి చంద్రశేఖరరెడ్డి మాట్లాడుతూ స్నేహిత అమృత హస్తం సేవా సమితి, ఉచిత విద్య ఉపాధ్యాయ బృందం సేవలు వెల కట్టలేమని కొనియాడారు. ఈ కార్యక్రమం చేపడుతున్న స్నేహిత అమృత హస్తం సేవాసమితి, ఉచిత విద్య ఉపాధ్యాయ బృందం సేవలు అభినందనీయమన్నారు. అలాగే ఎంఈఓ రామకృష్ణయ్య మాట్లాడుతూ ఈ పాలీసెట్‌లో విద్యార్థులు పొందే ర్యాంక్ వారి భవిష్యత్తు విజయాలకు ప్రేరణగా నిలుస్తుందన్నారు. అనంతరం మాక్ పాలీసెట్ (నమూనా పరీక్ష)లో అత్యుత్తమ ప్రతిభ కనబరచిన విజేతలైన బాలుర విభాగంలో ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాలలో సుందరేశ్వర్, దుర్గా నాగేంద్ర, నంది వర్ధన్ రెడ్డి, బాలికల విభాగంలో ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాలలో నిలిచిన సహాన్, శ్రావణి యామినిలకు సారెడ్డి చంద్రశేఖర్ రెడ్డి, సేవా సమితి అధ్యక్షుడు రాజులు బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో ఉచిత విద్య ఉపాధ్యాయ బృందం రామసుబ్బారెడ్డి, వెంకట నారాయణ, కృష్ణారెడ్డి, సుబ్బారెడ్డి, అమర్‌నాథ్ రెడ్డి, మహేశ్వర్ రెడ్డి, నాగార్జున రెడ్డి, విజయానందన్ రెడ్డి, శివ గంగాధర్ రెడ్డి పాల్గొన్నారు.

హామీల అమల్లో 'కూటమి' విఫలం

ఎర్రగుంట్ల (జమ్మలమడుగు): ఎన్నికల హామీలను అమలు చేయడంలో టీడీపీ కూటమి ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని ఒకటో వార్డు కౌన్సిలర్, క్రిష్టియన్ మైనార్టీ అధ్యక్షుడు మోపూరి ప్రశాంత్ విమర్శించారు. సోమవారం ఎర్రగుంట్ల పార్టీ కార్యాలయంలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఎమ్మెల్యే ఆదినారాయణరెడ్డి మున్సిపాలిటిని అభివృద్ధి చేశానని చెబుతున్నారని పేర్కొన్నారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో డీఎంఆర్ నిధులు ఎర్రగుంట్లకు రూ. 2కోట్లు కేటాయించారని, ప్రస్తుతం ఆ నిధులు మంజూరు కావడంతో రోడ్ల నిర్మాణాలు చేస్తున్నారని తెలిపారు. కూటమి నాయకులు ఎన్నికల సమయంలో ఇచ్చిన సూపర్ సిక్స్‌లో ఇప్పటి వరకు ఒకటి కూడా అమలు కాలేదన్నారు. నాడు మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఇచ్చిన మాట ప్రకారం నవరత్నాలు ఐదు సంవత్సరాలపాటు అమలు చేశారని చెప్పారు. మీడియా కో ఆర్డినేటర్ భూమిరెడ్డి దివాకర్ రెడ్డి, చెన్న కేశవరెడ్డి, అశోక్‌రెడ్డి పాల్గొన్నారు.

వడ్డీలో రాయితీని సద్వినియోగం చేసుకోండి

కమలాపురం: కమలాపురం మున్సిపాలిటీ పరిధిలోని ప్రజలు ఇప్పటివరకు ఉన్న ఆస్తి పన్ను బకాయిలకు సంబంధించి వడ్డీలో 50 శాతం రాయితీని సద్వినియోగం చేసుకోవాలని కమలాపురం మున్సిపల్ కమిషనర్ పగడాల జగన్నాథ్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. 2024–25 ఏడాదికి సంబంధించిన ఆస్తి పన్ను బకాయిలను వన్‌టైం సెటిల్‌మెంట్ కింద ఈ నెల 30వ తేదీలోపు చెల్లిస్తే వడ్డీలో 50 శాతం మాఫీ జరుగుతుందని ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసిందన్నారు. అలాగే 2025–26 ఏడాదికి సంబంధించి ఆస్తి పన్నులు చెల్లిస్తే అందులో 5 శాతం రిబేట్ వర్తిస్తుందని ఆయన పేర్కొన్నారు. పట్టణ ప్రజలు ఆస్తి పన్ను బకాయిలను ఈ నెల 30వ తేదీలోపు చెల్లించి ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

దరఖాస్తుల ఆహ్వానం

పులివెందుల టౌన్ : పట్టణంలోని ప్రైవేట్ పాఠశాలల్లో ఉచిత ప్రవేశాలకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నామని ఎంఈఓ రామానాయుడు తెలిపారు. సోమవారం పట్టణంలోని స్థానిక ఎమ్మార్సీ కార్యాలయంలో ప్రైవేట్ పాఠశాలల్లో ఉచిత ప్రవేశాలకు సంబంధించిన కరపత్రాలను ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డీఈఓ షంషుద్దీన్, సమగ్ర శిక్ష అడిషనల్ ప్రాజెక్టు ఓ.ఆర్డినేటర్ల నిత్యానందరాజుల ఆదేశాల మేరకు ఓ ప్రైవేట్ పాఠశాలల్లో కూడా ప్రతి కూల పరిస్థితులను ఎదుర్కొంటున్న నిరుపేద విద్యార్థులకు 25శాతం సీట్లు కేటాయించాల్సి ఉంటుందన్నారు. 5 ఏళ్లు నిండిన పిల్లలకు మాత్రమే అడ్మిషన్లు ఇవ్వాల్సి ఉంటుందన్నారు. సీబీఎస్ఈ, ఐసీఎస్ఈ, ఐబీ సిలబస్ ఉన్నత పాఠశాలల్లో ఈ ఏడాది మార్చి చివరి నాటికి 5ఏళ్లు నిండి ఉండాలన్నారు.

జీతాలు ఇప్పించండి మహాప్రభో!

ఎంపీడీఓకు సచివాలయ ఉద్యోగుల వినతి



ఎంపీడీఓ కుళ్లాయమ్మకు వినతి పత్రం అందిస్తున్న సచివాలయ ఉద్యోగులు

వేంపల్లె : రెండు నెలలుగా వేంపల్లె పంచాయతీ పరిధిలోని గ్రామ సచివాలయాల్లో పనిచేస్తున్న సచివాలయ ఉద్యోగులకు జీతాలు అందలేదు. దీంతో సోమవారం ఎంపీడీఓ కుళాయమ్మకు సచివాలయ ఉద్యోగులు తమకు జీతాలు మంజూరు చేయాలని వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా గ్రామ సచివాలయ ఉద్యోగులు మాట్లాడుతూ వేంపల్లె పంచాయతీ పరిధిలోని 8 గ్రామ సచివాలయాల్లో 60 మంది సిబ్బంది ఆయా విభాగాల్లో పని చేస్తున్నారని, గ్రామ సచివాలయాల్లో పనిచేస్తున్న ఉద్యోగులకు వేంపల్లె పంచాయతీ కార్యదర్శి సుబ్బారెడ్డి ఆధ్వర్యంలో జీతాలు వచ్చేవని, కానీ ఇటీవల ఈఓ సుబ్బారెడ్డిని ఉన్నతాధికారులు సస్పెండ్ చేయడం జరిగిందన్నారు. ఈఓ సస్పెండ్ కావడం వలన సచివాలయాల్లో పనిచేస్తున్న 60 మందికి రెండు నెలల నుంచి జీతాలు రాకపోవడంతో ఇబ్బందులు పడుతున్నామని, జీతాల కోసం ఎదురు చూస్తున్నట్లు తెలిపారు. పంచాయతీ కార్యదర్శి రాకపోవడంతో తమ జీతాలు కూడా నిలిచిపోయాయని, జీతాలు మంజూరు కాకపోవడంతో ఇంటి ఖర్చులకు కూడా డబ్బులు లేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని వాపోయారు. గతంలో కూడా జీతాల విషయమై ఎంపిడిఓకు విన్నవించడం జరిగిందని, జీతాలు మంజూరుపై జిల్లా ఉన్నతాధికారులు స్పందించి జీతాలు మంజూరు చేయాలని కోరారు. జిల్లా అధికారులు జీతాలు విషయమై నివేదిక పంపి సచివాలయ ఉద్యోగులకు జీతాలు మంజూరయ్యే విధంగా కృషి చేస్తానని హామీ ఇచ్చారు.

గ్రంథాలయాలు.. విజ్ఞాన కేంద్రాలు



శిబిరాన్ని ప్రారంభిస్తున్న డాక్టర్ ఎంఎల్ నారాయణరెడ్డి

సింహాద్రిపురం : గంథాలయాలు.. విజ్ఞాన కేంద్రాలని గ్రంథాలయాధికారులు గంగాదేవి, శేఖర్ తెలిపారు. సోమవారం స్థానిక గ్రంథాలయాల్లో పిల్లలకు సమ్మర్ క్యాంపులు ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వేసవి శిక్షణా శిబిరంలో భాగంగా గ్రంథాలయాల్లో నిర్వహిస్తున్న సమ్మర్ క్యాంపులను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. గ్రంథాలయాలు విజ్ఞానాన్ని అందించడంతోపాటు వినోదాన్ని పంచుతాయని పేర్కొన్నారు. వేసవిలో పిల్లలు సెల్‌ఫోన్ చూడకుండా గ్రంథాలయాలకు పంపించాలని తల్లిదండ్రులకు సూచించారు. గ్రంథాలయాలకు పిల్లలను పంపిస్తే కథలు చదవడం, చెప్పడం, ఆటపాటలతో పిల్లలలో నైపుణ్యాన్ని వెలికితీయడానికి తల్లిదండ్రులు ప్రోత్సహించాలని సూచించారు. నైపుణ్యం ప్రదర్శించిన పిల్లలకు, విద్యార్థులకు బహుమతుల ప్రదానం చేస్తామని తెలిపారు.

చింతకొమ్మదిన్నె : చింతకొమ్మదిన్నె గ్రంథాలయంలో ఈ నెల 28వ తేదీ నుంచి జూన్ 6వ తేదీ వరకు వేసవి విజ్ఞానశిబిరం నిర్వహించనున్నట్లు గ్రంథాలయాధికారి ఇబ్రహీం తెలిపారు. విద్యార్థులు ఈ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు, స్పోకెన్ ఇంగ్లీష్, బయాలజీ క్లాసులకు వచ్చే విద్యార్థులు తమ వెంట నోటు పుస్తకం పెన్ను తెచ్చుకోవాలని సూచించారు.

విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలి

జమ్మలమడుగు: విద్యార్థులు వేసవి విజ్ఞాన శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని గ్రంథాలయ కమిటీ అధ్యక్షుడు బండారు శ్రీనివాసులు, గ్రంథాలయ అధికారి జింకా చంద్రశేఖర్ పేర్కొన్నారు. సోమవారం స్థానిక లైబ్రరీలో వేసవి శిబిరాన్ని డాక్టర్ ఎంఎల్ నారాయణరెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిత్యం గ్రంథపఠనం చేస్తే భవిష్యత్‌లో మంచి విజ్ఞానవేత్తగా ఎదుగుతారన్నారు. ప్రతి విద్యార్థి తప్పనిసరిగా గ్రంథ పఠనం చేయాలని, అదే వారి జీవితాన్ని ఉన్నత దిశగా నడిపిస్తుందని ఆయన తెలిపారు. ప్రతి రోజు ఉదయం 8 గంటల నుంచి 11 గంటల వరకు కార్యక్రమాలు ఉంటాయని సూచించారు. ఈ కార్యక్రమంలో కమిటీ సభ్యులు శివగణపతి, లక్ష్మీనారాయణ, కుండాభాస్కర్, మనోహర్‌రెడ్డి, నరసింహులు విద్యార్థులు పాల్గొన్నారు.

భయం వీడి పరీక్షలు రాయాలి



మాక్ టెస్టు రాస్తున్న విద్యార్థులు

జమ్మలమడుగు: పరీక్షలు రాసే విద్యార్థులు భయం వీడి పరీక్షలు రాయాలని పాలిటెక్నికల్ కాలేజీ ప్రిన్సిపాల్ రవికుమార్ పేర్కొన్నారు. ఈనెల 30వ తేదీన పాలిసెట్ పరీక్ష రాస్తున్న విద్యార్థులకు సోమవారం మాక్ టెస్టు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాలిటెక్నికల్ చదువుకునే విద్యార్థులకు ఉద్యోగావకాశాలు ఎక్కువగా ఉన్నాయని తెలిపారు. ప్రస్తుతం మారుతున్న సమాజంలో టెక్నికల్ వైపు విద్యార్థులు దృష్టి సారిస్తే త్వరగా ఉద్యోగాలు వస్తాయని సూచించారు. పాలిసెట్ నమూనా పరీక్షకు 380 మంది విద్యార్థులు హాజరయ్యారని, బాగా రాసిన 20మంది విద్యార్థులకు బహుమతులను ప్రదానం చేసినట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సురేంద్ర, అధ్యాపకులు తదితరులు పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయంతో అధిక దిగుబడి

ముద్దనూరు: ప్రకృతి వ్యవసాయం చేయడం వల్ల పెట్టుబడులు తగ్గడమే కాకుండా అధిక దిగుబడులు సాధించవచ్చునని వ్యవసాయ సహాయ సంచాలకులు వెంకటసుబ్బయ్య తెలిపారు. సోమవారం స్థానిక మండల సమాఖ్య భవనంలో ప్రకృతి వ్యవసాయంపై అవగాహన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏడీఏ మాట్లాడుతూ ప్రకృతి వ్యవసాయంపై ప్రతి రైతు దృష్టి పెట్టాలని, రసాయన రహిత వ్యవసాయంపై అవగాహన పెంచుకోవాలని సూచించారు. తక్కువ ఖర్చుతో ఎక్కువ దిగుబడి, ఆదాయం పొందవచ్చని తెలిపారు. ఈ మండల వ్యవసాయాధికారి వెంకట కృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ప్లాస్టిక్‌తో మానవాళికి ముప్పు



మాట్లాడుతున్న మున్సిపల్ కమిషనర్ శేషఫణి

ఎర్రగుంట్ల (జమ్మలమడుగు): ప్లాస్టిక్ విచ్చలవిడి వినియోగంతో మానవాళికి తీవ్ర ముప్పు ఏర్పడుతుందని మున్సిపల్ కమిషనర్ శేషఫణి పేర్కొన్నారు. సోమవారం మున్సిపల్ కార్యాలయంలో పట్టణంలోని వ్యాపారులకు ప్లాస్టిక్ నిషేధంపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్లాస్టిక్ రహిత మున్సిపాలిటీగా తీర్చిదిద్దేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని కోరారు. బాధ్యత గల పౌరులు ఒక సారి ఉపయోగించే ప్లాస్టిక్‌లను తిరస్కరించాలని తెలిపారు. పర్యావరణ అనుకూల ప్రత్యామ్నాయాలను ఎంచుకోవడం ద్వారా ప్లాస్టిక్ వినియోగం పూర్తిగా తగ్గిపోతుందని పేర్కొన్నారు. ప్లాస్టిక్ వాడకంతో అనేక అనర్థాలు సంభవిస్తాయని హెచ్చరించారు.

కనుల పండువగా హేలాంబ తిరునాల

- జనసంద్రమైన పెద్దచెప్పలి
- మొక్కులు చెల్లించుకున్న భక్తులు



బంగారు చీర అలంకరణలో ఎల్లమ్మ

వేలాదిగా తరలివచ్చిన భక్తులు

కమలాపురం: మండల పరిధిలోని పెద్దచెప్పలిలో వెలసిన శ్రీ హేలాంబ అమ్మవారి తిరునాల మహోత్సవం అంగరంగ వైభవంగా జరిగింది. ఈ నెల 23వ తేదీ నుంచి జరుగుతున్న హేలాంబ తిరునాల మహోత్సవాల్లో భాగంగా సోమవారం ప్రధాన తిరునాల కనుల పండువగా జరిగింది. ఆలయ ట్రస్ట్ బోర్డు చైర్మన్ తోట రవీంద్ర, కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో తిరునాల మహోత్సవాలు ఉత్సాహభరితంగా జరిగాయి. ఉదయం తోట కుటుంబ సభ్యులు అమ్మవారికి బంగారు కిరీటం, బంగారు చీర, ఆభరణాలతో ఊరేగింపుగా తీసుకువచ్చి ప్రత్యేకంగా అలంకరించారు. వేద పండితుల మంత్రోచ్ఛారణలతో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయం నుంచి సాయంత్రం అమ్మవారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. సాయంత్రం అమ్మవారు పుష్పాలంకారంలో దర్శనమిచ్చి భక్తులను కనువిందు చేశారు.

మాజీ ఎమ్మెల్యే ప్రత్యేక పూజలు

కమలాపురం మాజీ ఎమ్మెల్యే, వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు రవీంద్రనాథ్‌రెడ్డి ఎల్లమ్మను దర్శించుకున్నారు. ఆలయ మాజీ ట్రస్ట్ బోర్డు చైర్మన్ మాచునూరు ఇంద్రావతమ్మ ఆహ్వానం మేరకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. నియోజకవర్గ ప్రజలు సుఖ శాంతులతో వర్ధిల్లాలని అమ్మవారిని కోరారు. అనంతరం రవీంద్రనాథ్‌రెడ్డిని ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు పాల్గొన్నారు.

పెద్దచెప్పలి హేలాంబ తిరునాలకు జిల్లా వ్యాప్తంగా భక్తులు వేలాదిగా తరలివచ్చారు. దీంతో పెద్దచెప్పలి గ్రామం జనసంద్రంగా మారింది. అమ్మవారిని దర్శించుకోవడానికి భక్తులు క్యూ లైన్లలో కిక్కిరిసి కన్పించారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా నిర్వాహకులు చర్యలు తీసుకున్నారు.

అలరించిన నాటక ప్రదర్శనలు

హేలాంబ తిరునాల మహోత్సవాన్ని పురస్కరించుకొని ఆలయ సమీపంలో సోమవారం రాత్రి చెప్పలి ఎల్లమ్మ నాట్య కళా మండలిచే ఏర్పాటు చేసిన గయోపాఖ్యానం (యుద్ధసీను), భక్త చింతామణి పూర్తి నాటకం ప్రదర్శించారు. వివిధ ప్రాంతాల నుంచి ప్రజలు నాటకాలను చూసేందుకు తరలివచ్చారు.

బండ లాగుడు పోటీలు



రాతి దూలాన్ని లాగుతున్న ఎద్దులు

మండల పరిధిలోని పెద్దచెప్పలి హేలాంబ తిరునాల సందర్భంగా సోమవారం నిర్వహించిన బండ లాగుడు పోటీలు రసవత్తరంగా సాగాయి. రాష్ట్రంలోని వివిధ జిల్లాల నుంచి 12 ఎద్దుల జతలు ఈ పోటీల్లో పాల్గొన్నాయి. బండలాగుడు పోటీలను ఎమ్మెల్యే చైతన్య రెడ్డి, ఆలయ చైర్మన్ తోట రవీంద్ర ప్రారంభించారు. నువ్వా? నేనా? అన్నట్టుగా ఎద్దులు తలపడ్డాయి. సోమవారం చీకటి పడే వరకు పోటీలు నిర్వహిస్తామని, మిగిలిన వాటికి మంగళవారం పోటీలు నిర్వహిస్తామని నిర్వాహకులు తెలిపారు. ప్రథమ బహుమతి రూ.1.20 లక్షలతో పాటు మొత్తం 10 బహుమతులు ప్రకటించారు. ఈ పోటీలను చూసేందుకు ప్రజలు పెద్ద ఎత్తున తరలి వచ్చారు.